సమాచారం ఇవ్వని కియోస్క్‌లు

- నియోజకవర్గంలో ఎక్కడా పని చేయని వైనం
- కియోస్క్ డిజిటల్ ఆధారిత సేవలు కనుమరుగు
- ఆర్బీకేలను నీరుగార్చిన కూటమి ప్రభుత్వం
- రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్పునకే పరిమితం

చాగల్లు: రైతు సంతోషంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందనే నానుడిని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అక్షరాలా ఆచరణలో పెట్టింది. రైతుల వద్దకే రైతుభరోసా కేంద్రాల (ఆర్బీకే) సేవలను అందుబాటులోకి తెచ్చి వారికి వరంలా మార్చింది. అంతకుముందు టీడీపీ పాలనలో రైతన్నలు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల కోసం పడిన కష్టాలు పునరావృతం కాకుండా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నాణ్యమైన ఎరువులు, పురుగు మందుల, నాణ్యమైన విత్తనాలు ఎమ్మార్పీకే రవాణా సమస్య లేకుండా రైతులకు స్థానికంగానే అందేలా చర్యలు తీసుకుంది. ప్రధానంగా రైతుభరోసా కేంద్రాల్లోని కియోస్క్‌ల సాయంతో సాంకేతికంగా రైతులను ముందుకు తీసుకువెళ్లేలా చొరవ చూపింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. వాటి ద్వారా సేవల కొనసాగింపులోనూ వివక్ష చూపింది. వైఎస్సార్ సీపీ ముద్ర లేకుండా చేయడానికి ఆ సేవలకు స్వస్తి పలికింది. ఫలితంగా ఆర్బీకేల లక్ష్యాన్ని నీరుగార్చింది. రైతుసేవా కేంద్రాల్లోని కియోస్క్ సేవలు కొండెక్కాయి. కొవ్వూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పుడు ఎక్కడా కియోస్క్‌లు పనిచేయక పోవడం అన్నదాతలకు శాపంగా పరిణమించింది.

గతంలో కియోస్క్ సేవలిలా...

ఆర్బీకేల్లోని డిజిటల్ ఆధారిత సేవల ద్వారా ఈ మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌లను అందుబాటులోకి తెచ్చారు.



చాగల్లు రైతు భరోసా కేంద్రం

ఇందులో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు, రైతులు పండించిన వ్యవసాయోత్పత్తులకు మార్కెట్ రేటు, సమీపంలోని మార్కెట్ల వివరాలు, అక్కడి ధరలు కియోస్క్‌లలో డిస్ ప్లే అయ్యేవి. ఫలితంగా రైతులకు కచ్చితమైన సమాచారం తెలిసేది. ముఖ్యంగా వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పులు ఏ సీజన్లో ఏ పంటలు సాగు చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చో వంటి సమాచారం ఇక్కడ లభించేది. నాడు రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న కియోస్క్ సేవలు కూటమి ప్రభుత్వ పాలనలో వారి దరికి చేరకుండా పోయాయి.

కూటమి రాకతో నిర్లక్ష్యం..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆర్బీకేలపై నిర్లక్ష్యం మొదలైంది. ఇందులోని సేవలన్నీ మాయమయ్యాయి. సాంకేతిక సమస్యల వల్ల ఈ కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాలు పని చేయడం లేదు. రూ. లక్షల విలువైన ఈ యంత్రాలు ఇప్పుడు దిష్టి బొమ్మలుగా మారాయి. కొన్నిచోట్ల ఇవి బాగున్నా ఇంటర్నెట్ లేదంటూ ఆపేశారు. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం నిరుపయోగమైంది. కియోస్క్‌లు ఉన్నప్పటికీ అవి రైతులకు మేలు చేయని పరిస్థితి కల్పించారు. వాటిని స్థానిక వ్యవసాయశాఖ అధికారులు సైతం అసలు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా వీటి సేవలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

మండలాల వారీగా రైతు సేవా కేంద్రాలు

చాగల్లు	18
కొవ్వూరు	19
తాళ్లపూడి	15


మూలన పడిన కియోస్క్ యంత్రం

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం

సాంకేతిక సమస్యల కారణంగా కొన్ని రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్‌లు పని చేయడం లేదు. ఆయా గ్రామాల్లో ఎన్ని పని చేయడం లేదో తెలుసుకుని సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాం.
– కె.వేణుగోపాల్, ఏవో, చాగల్లు మండలం

కియోస్క్‌లతో ఎంతో ప్రయోజనం



రైతు సేవా కేంద్రాలు గత ప్రభుత్వంలో మాదిరిగా లేవు. ఈ కేంద్రాల్లోని కియోస్క్‌లలో రైతులకు అవసరమైన ఎన్నో సేవలు అందుబాటులో ఉండేవి. ఇప్పుడా సేవలేవీ లేవు. ఆ మెషీన్ పని చేయడం లేదు. ఇప్పటికే ఉన్న మెషీన్ ను రెడీ చేస్తే సరిపోతుంది. ఏదో ఓ సమయంలో రైతులు సెంటర్ కు వెళ్లి దాని ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు
–లకంసాని సూర్యప్రకాశరావు, మాజీ సర్పంచ్, మల్లవరం

క్లుప్తంగా

మద్యం డిపోలో ఎక్సైజ్ కమిషనర్ తనిఖీలు


చాగల్లులో ఐఎంఎల్ డిపోను సందర్శించిన కమిషనర్

చాగల్లు: నెలవారీ తనిఖీల్లో భాగంగా చాగల్లులోని ఐఎంఎల్ డిపోను జిల్లా ఎక్సైజ్ కమిషనర్ చైతన్య మురళి గురువారం తనిఖీ చేశారు. డిపోను పరిశీలించాక, సరకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రూ.వంద, రూ.130 ధరల్లోనూ పలు రకాల మద్యం బ్రాండ్లను అందుబాటులో ఉంచామని చైతన్య మురళి చెప్పారు. మద్యం దుకాణాల్లో అన్ని రకాల బ్రాండ్ల మద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిపోలో సరకు నిల్వ కోసం అదనంగా షెడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిపారు. డిపో పరిధిలో 111 మద్యం షాపులు ఉన్నాయన్నారు. వాటి నిర్వహణ, పనితీరు సక్రమంగా ఉండేలా పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా డిపోలో పని చేసే హమాలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డిపో మేనేజర్ రామకృష్ణదాస్ కూడా పాల్గొన్నారు.

17న కొవ్వూరులో చర్మవ్యాధుల వైద్య శిబిరం

కొవ్వూరు: ఈనెల 17న కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మంటపంలో లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ ఆధ్వర్యంలో ఉచిత చర్మ వ్యాధుల వైద్య శిబిరం నిర్వహిస్తామని ఆ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి వీర వెంకట సత్యనారాయణ గురువారం తెలిపారు. ఏలూరుకు చెందిన విజయ చర్మవ్యాధుల ఆసుపత్రి వైద్యుడు, గోల్డ్ మెడలిస్ట్ డి.సుబ్బారావు ఈ శిబిరంలో వైద్య సేవలందిస్తారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఉదయం 10 గంటలకు ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. కావున పట్టణ పరిసర ప్రాంత వాసులంతా ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు.

15న మహాదన్ను సభ

చాగల్లు: ఈనెల 15 మధ్యాహ్నం మూడు గంటలకు రాజమహేంద్రవరంలోని లాలాచెరువు వద్ద శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశైన, యాత మహాదన్ను సభ నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర శెట్టిబలిజ అభివృద్ధి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కె.సత్తిబాబు తెలిపారు. గురువారం చాగల్లు విచ్చేసిన ఆయన మండలంలోని సంఘ నాయకులను కలసి ఆహ్వానం పలికారు. దివంగత నేత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అభినందన కార్యక్రమం, శెట్టిబలిజ కార్పొరేషన్ పాలక వర్గ సభ్యుల ప్రమాణస్వీకారం నిర్వహిస్తామన్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం


శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారు

దేవరపల్లి: స్థానిక శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది.గీతా జయంతిని పురస్కరించుకుని రాత్రి 7.30 నుంచి 11.30 గంటల వరకూ స్వామి వారి కల్యాణం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన నెమ్మత్స నందకిషోర్, ఇందిరాదేవి దంపతులు స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణాన్ని జరిపించారు. ఆలయ అర్చకులు కేశావాచార్యులు, సత్మదత్త దుర్గాప్రసాద్, వేద పండితుడు కార్తిక్ స్వామి వారి కల్యాణ తంతు జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

15న జిల్లా జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

నల్లజర్ల: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు ఈనెల 15న ఏలూరులోని సీఆర్ఆర్ కళాశాలలో నిర్వహిస్తారు. హాజరయ్యే క్రీడాకారులు 12-01-2005 తర్వాత జన్మించిన వారై ఉండాలని, బాలురు 70 కిలోలు, బాలికలు 65 కిలోల లోపు బరువు ఉండాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీకాంత్ బుధవారం తెలిపారు. ఆధార్ కార్డు, టెన్త్ మార్కుల జాబితాలతో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలన్నారు.ఎంపికైన జట్లు రావులపాలెంలో నిర్వహించే 50వ జూనియర్ కబడ్డీ స్టేట్ టోర్నమెంట్‌లో ఆడాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 99851 47123, 94913 33906 నంబర్లను సంప్రదించాలన్నారు.

చాగల్లులో అన్న సమారాధన

చాగల్లు: చాగల్లు ప్రధాన కూడలిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఆలయ ప్రాంగణంలో భారీఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. చాగల్లు, నెలటూరు, మీనానగరం పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పర్యవేక్షించారు.

రోగికి 'మానవత' ఆర్థిక సాయం

నల్లజర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న తూర్పు చోడవరం గ్రామస్తుడు మిద్దే వెంకటేశ్వరావుకు మానవత సంస్థ మండల శాఖ గురువారం రూ.4 వేల ఆర్థిక సాయం చేసింది. కార్యక్రమంలో ఆ సంస్థ మండల చైర్మన్ భోగవల్లి వెంకట సుబ్బారావు, మండల కన్వీనర్ గుళ్ళపూడి వెంకటరత్నం, సలహా మండలి మెంబరు మద్దు రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ ధర్నా

నిడదవోలు: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ధర్నా చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ట్రూఅప్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో చార్జీలు పెంచి ప్రజలపై భారం వేశారని ఆ పార్టీ నాయకులు అన్నారు. వెంటనే రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు రాంబాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను ధ్వంసం చెయ్యాలని ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు, లోకేష్‌లు పిలుపు ఇచ్చారని గుర్తు చేశారు. తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మొండి చెయ్యి చూపిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం


పెంచిన విద్యుత్ బిల్లులను నిడదవోలులో దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

విద్యుత్ చార్జీలను పెంచితే చంద్రబాబు, పవన్ కల్యాణ్ వ్యతిరేకించారన్నారు. అధికారంలో లేనపుడు ఒకమాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరొక మాట మాట్లాడటం సరికాదన్నారు. ధర్నాలో రమేష్, శేఖర్, పెద్దిరాజు, సుధీర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు 15 ఫిర్యాదులు

నిడదవోలు: స్థానిక విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికకు వినియోగదారుల నుంచి 15 ఫిర్యాదులు అందాయి. సీజీఆర్ఎఫ్, ఏపీఈపీ డీసీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ కరెంటు బిల్లుల్లో లోపాలు, విద్యుత్ మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, కాలిపోయిన మీటర్లు, మీటర్లలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల వంటి సమస్యలపై పరిష్కార వేదికలో వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వినియోగదారులు తక్షణ న్యాయం పొందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థు


పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్న వినియోగదారులు

లకు విద్యుత్ సేవా లోపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ సాంకేతిక సభ్యుడు ఎస్. మసిలమణి, ఆర్థిక సభ్యుడు షేక్ బాబర్, విద్యుత్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు, ఏడీఈ పీయూబీ శ్రీధర్, పట్టణ విద్యుత్ ఏఈ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ రుద్ర, అధ్యాపకులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు

ఆర్డీవో రాణి సుస్మిత వెల్లడి

కొవ్వూరు: భూ వివాదాల పరిష్కారానికి గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులే వేదికలని ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు. దొమ్మేరులో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. మండల కేంద్రంలో అధికారులు అందుబాటులో ఉంటారని, ఎప్పుడైనా వచ్చి ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు ఇవ్వవచ్చని అన్నారు. 33 రోజుల్లో భూవివాదాలు కొలిక్కి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులకు తెలుగులోనే రసీదు, తిరుగు సమాధానం ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవో చెప్పారు. కొవ్వూరు తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఈ రెవెన్యూ సదస్సులో 47 అర్జీలు అందాయన్నారు. వాటిలో 32 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించినట్టు తెలిపారు. మిగిలిన 15 ఆక్రమణలు, పాసు పుస్తకాలు, అడంగల్‌లో తప్పులు సరి చేయాలంటూ రైతుల నుంచి అర్జీలు వచ్చాయన్నారు. వాటిని విచారించి నిర్దిష్ట సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. మండల ఎండోమెంట్ ఆఫీసర్ ఎం.సూర్య ప్రకాశరావు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎస్.కృష్ణ, సర్పంచ్ తానేటి కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు ఆళవు సరోజిని, ఆర్ఐ బీవీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


దొమ్మేరు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో రాణి సుస్మిత

తాళ్లపూడిలో 8 అర్జీలు

తాళ్లపూడి: భూ సమస్యల పరిష్కారానికి గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు సూచించారు. తాళ్లపూడి సచివాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లపూడి, కుకునూరు గ్రామాల రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోరుతూ 8 అర్జీలు అందజేసినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోదాటి కనకం, తహసీల్దార్ బి. రవీంద్రనాథ్, డిప్యూటీ తహసీల్దార్ మోహనభారతి, పంచాయతీ కార్యదర్శి కేఎస్ వీరన్న, ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వో లీలావతి పాల్గొన్నారు.

సి క్లాస్ భూములకు పట్టాలు ఇప్పించండి

పెరవలి: పదేళ్లుగా తాము సాగు చేసుకుంటున్న గోదావరి లంకల్లోని సి క్లాస్ భూములకు పట్టాలు ఇప్పించాలని ముక్కామల రైతులు మొరపెట్టుకున్నారు. కాకరపర్రు గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించగా, రైతుల నుంచి అధికారులకు 10 అర్జీలు అందాయి. కాకరపర్రు సరిహద్దుల్లోని గోదావరి లంక భూములను పదేళ్లుగా తాము సామూహికంగా సాగు చేసుకుంటున్నామని, ఆ భూములపై తమకు సి క్లాస్ పట్టాలు ఇప్పించాలని 17 మంది రైతులు కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ డి.అచ్యుత కుమారి మాట్లాడుతూ ఈ సదస్సులో రైతుల నుంచి ఆక్రమణలు తొలగించాలని, పంట భూములకు వెళ్లే రహదారులు ఆక్రమించుకున్నారంటూ మూడు ఫిర్యాదులు వచ్చాయన్నారు. అలాగే లంక భూములకు పట్టాలు ఇవ్వాలని ఒక అర్జీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పావని, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బందపురంలో 18 అర్జీలు

దేవరపల్లి: బందపురం గ్రామ సచివాలయం వద్ద గురువారం సర్పంచ్ కాట్రగడ్డ పరమేశ్వరరావు (గాంధీ) అధ్యక్షతన నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సుకు వివిధ భూ సమస్యల పరిష్కారం కోరుతూ రైతులు 18 అర్జీలు అందజేశారు. తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామ సదస్సుల్లో వచ్చిన సమస్యలను పరిశీలించి 45 రోజుల్లోగా పరిష్కరిస్తామన్నారు.ఈ సందర్భంగా గ్రామంలోని ముత్యాలమ్మ గుడి వద్ద గల లబ్ధిదారులకు ఇళ్లస్థలాల పట్టాలు అందజేశారు. మండల ప్రత్యేకాధికారి ఎస్.సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, ఉప సర్పంచ్ మునికోటి నాగరాజు, వీఆర్వో కె. వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ మొహిద్దీన్ షరీఫ్ పాల్గొన్నారు.


తాళ్లపూడి రెవెన్యూ సదస్సులో అర్జీ అందజేస్తున్న మహిళా రైతు

నల్లజర్ల: మండలంలోని అనుమునిలంక పంచాయతీ పరిధిలో పోతినీడుపాలెం సచివాలయం వద్ద సర్పంచ్ పిచ్చుకుల గణపతి అధ్యక్షత గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మ్యుటేషన్ కోసం మూడు, సర్వే నిమిత్తం ఒక దరఖాస్తు వచ్చినట్టు డిప్యూటీ తహసీల్దార్ శాంతిప్రియ తెలిపారు. వచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో వెలగదుర్రు, దమ్మెన్ను గ్రామాల్లో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహించారు. వెలగదుర్రు గ్రామ రైతుల నుంచి రెండు, దమ్మెన్ను గ్రామ రైతుల నుంచి ఐదు అర్జీలు అందాయని తహసీల్దార్ తెలిపారు. వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలో దారవరంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం భూ సమస్యలపై రైతుల వద్ద నుంచి అధికారులు అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.మెరికమ్మ, సర్పంచ్ మద్దుకూరి రవి ప్రసాద్, నాయకులు బొడ్డు రాజు, నాదెళ్ల శ్రీరామ్, బొడ్డు కేశవ తదితరులు పాల్గొన్నారు.

మోటార్లలో విద్యుత్ కేబుల్ వైర్ల చోరీ

లబోదిబోమంటున్న రైతులు


కృష్ణంపాలెం పొలంలో మోటారు స్టార్టర్ బాక్సు ధ్వంసం చేసిన దుండగులు

దేవరపల్లి: మోటార్లలోని విద్యుత్ కేబుల్ చోరీ ముఠా మెట్ట ప్రాంత రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. పొలాల్లోని వ్యవసాయ బోర్ల వద్ద గల మోటార్లలోని కేబుల్ వైర్ల చోరీ ఈ ముఠా టార్గెట్. సాయంత్రం పొలం నుంచి రైతులు ఇళ్లకు రాగానే ముఠా పొలాలకు వెళ్లి మోటార్ల వద్ద గల కేబుల్ తీగలను కట్ చేసి దానిని అక్కడే మంటలో కాల్చి దానిలోని రాగితీగను దొంగిలిస్తున్నారు. ఎక్కువగా దేవరపల్లి, కృష్ణంపాలెం, యర్నగూడెం, కొత్తగూడెం, రామన్నపాలెం, బందపురం గ్రామాల్లో ఈ తరహా చోరీలు జరుగుతున్నట్టు రైతులు తెలిపారు. బుధవారం రాత్రి కృష్ణంపాలెంలోని సత్తి సాయి ఈశ్వరరెడ్డి, తేతలి శ్రీనివాసరెడ్డి, అమ్మిరెడ్డి పొలాల్లోని కేబుల్ తీగలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. తన పొలంలోని మోటార్ స్టార్టర్ బాక్సు ధ్వంసం చేసి, కేబుల్ దొంగిలించుకుపోయినట్టు సత్తిసాయి ఈశ్వరరెడ్డి తెలిపారు.

• విద్యార్థులే శ్రామికులైన వేళ..



పుస్తకం చేతబట్టి తరగతి గదిలో పాఠాలు వల్లె వేయవలసిన విద్యార్థులే శ్రామికులయ్యారు. వారంతా పాఠశాల ఆవరణలోని చెత్తను తీసుకు వెళ్లి వ్యాన్‌లో లోడ్ చేస్తున్నారు. ఈ దృశ్యం తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఆవిష్కృతమైంది. – తాళ్లపూడి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొవ్వూరు: దొమ్మేరులోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కాపవరం ఫీడర్, దొమ్మేరు సావరం, దొమ్మేరు లోకల్ ఫీడర్‌లకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వార్షిక మరమ్మతుల్లో భాగంగా ఈ పనులు చేపడుతున్నామన్నారు.

దేవరపల్లి: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. దేవరపల్లి టౌన్ ఫీడర్, 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్, 11 కేవీ అచ్చియపాలెం, గొల్లగూడెం ఫీడర్లకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వ్యవసాయానికి ఉదయం 5 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు.

గ్రామాల సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సమగ్ర శిక్షణ


గోపాలపురంలో శిక్షణ ఇస్తున్న జిల్లా ట్రైనర్ ప్రసంగిరాజు

కొవ్వూరు: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం కొవ్వూరులో ప్రారంభమైంది. చిడిపి, కుమారదేవం, ఆరికిరేవుల, పెనకనమెట్ట, ధర్మవరం సచివాలయాల సిబ్బందికి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన తొమ్మిది అంశాలపై ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీ ఉమామహేశ్వరరావు వివరించారు. అలాగే ఏపీఎం నిర్మలకుమారి, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాస్, సీడీపీవో డి.మమ్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిలక్, ఎంపీడీవో కె.సుశీల తదితరులు వివిధ అంశాలపై వారికి అవగాహన కల్పించారు.

గోపాలపురం: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండలంలోని సర్పంచులు, కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీపీఆర్సీ జిల్లా ట్రైనింగ్ మేనేజర్ గుర్రాల ప్రసంగిరాజు మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాల ద్వారా అర్హులకు మేలు చేకూరేలా గ్రామ పంచాయతీలు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, సామర్లకోట ఈటీసీ ఫ్యాకల్టీ ఎం.చక్రపాణిరావు, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండల స్థాయి అధికారులకు, సచివాలయ సిబ్బందికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించారు. 2030 నాటికి సుస్థిరాభివృద్ధి సాధించడం లక్ష్యంగా వివిధ శాఖల అధికారులకు ఈ శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో టీబీవీ వెంకటరమణ, ఎస్సై టి.రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ షేక్ సూర్జాన్, వెలుగు ఏపీఎం మంగాయమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యకుమారి, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

చాగల్లు: గ్రామ పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, డీపీఆర్సీ ఏలూరులో శిక్షణ పొందిన ఏపీఎం ఈ.శ్రీనివాస్, ఎంపీహెచ్‌వో శాస్త్రి 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రాముఖ్యత గురించి సర్పంచులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు వివరించారు.


కొవ్వూరు శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో సుశీల

ఉండ్రాజవరం: గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మండలస్థాయిలో స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో వి.రామారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ అంజనేయ శర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవానీ, ఎంఈవో శారద జ్యోత్స్న, సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సరస్వతి, భాగ్యలక్ష్మి, ఎంఆర్సీ కె.ప్రకాష్ పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్స్, వెల్ఫేర్ అసిసెంట్స్, అగ్రి కల్చర్ అసిసెంట్స్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.